క్లుప్తంగా

స్వచ్ఛంద రక్తదానాన్ని ప్రోత్సహించండి



సాయిబాబాను అభినందిస్తున్న రోటరీ గవర్నర్ భాస్కర్‌రామ్

బోట్‌క్లబ్: స్వచ్ఛంద రక్తదానాన్ని ప్రోత్సహించడం ద్వారా సమాజానికి, రక్తదాత ఆరోగ్యానికి ఎంతో మేలు చేకూరుతుందని రోటరీ గవర్నర్ భాస్కర్‌రామ్ అన్నారు. స్థానిక సాంబమూర్తినగర్‌లోని రోటరీ బ్లడ్‌బ్యాంక్‌ను ఆయన మంగళవారం సందర్శించారు. సకాలంలో రక్తం అందక చాలామంది మృత్యువాత పడుతున్నారన్నారు. వారిని రక్షించడానికి రోటరీ తనవంతు సహకారం అందించేందుకు బ్లడ్ బ్యాంక్‌ను స్థాపించి విశేష కృషి చేస్తోందన్నారు. బ్లడ్‌బ్యాంక్ చైర్మన్ టీవీ బాలకృష్ణ మాట్లాడుతూ 24 ఏళ్లుగా రోటరీ బ్లడ్‌బ్యాంక్ ద్వారా సుమారు 1.33 లక్షల మంది ప్రాణాలను కాపాడిందన్నారు. యువత రక్తదానాన్ని ప్రోత్సహించాలని కోరారు. స్వచ్ఛంద రక్తదానం చేసిన లంక సాయిబాబాను రోటరీ గవర్నర్ అభినందించారు. రోటరీ అసిస్టెంట్ గవర్నర్ పద్దరాజు, క్లబ్ అధ్యక్షులు జీవీ కృష్ణప్రకాష్, కార్యదర్శి వద్దాది ఆదిత్య, మాజీ గవర్నర్ ఎస్‌వీఎస్ రావు పాల్గొన్నారు.

ఉపాధి పథకం రద్దుకు కేంద్రం కుట్ర

కాకినాడ సిటీ: కేంద్ర బడ్జెట్‌లో ఉపాధి హామీ నిధులు భారీగా తగ్గించి ఈ కార్యక్రమాన్ని రద్దు చేయడానికి కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దడాల సుబ్బారావు విమర్శించారు. మంగళవారం ధర్నా చౌక్ వద్ద జిల్లా అధ్యక్షుడు టేకుమూడి ఈశ్వరరావు అధ్యక్షతన జరిగిన ధర్నాలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని తొమ్మిదేళ్ల బీజేపీ మోడీ పాలనలో కేంద్ర బడ్జెట్ కేటాయింపుల్లో ఉపాధి హామీ పనులకు కోత పెట్టడమే దీనికి నిదర్శనమన్నారు. కార్మికసంఘం జిల్లా కార్యదర్శి కేఎస్ శ్రీనివాస్, సీపీఎం జిల్లా కన్వీనర్ రాజశేఖర్, రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం




సీఐటీయూ జెండాను ఎగురవేస్తున్న బేబీరాణి తదితరులు

కాకినాడ సిటీ: సీఐటీయూ 54వ ఆవిర్భావ దినోత్సవాన్ని జిల్లా కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. యూనియన్ అఖిల భారత ఉపాధ్యక్షురాలు జి.బేబీరాణి పతాకాన్ని ఆవిష్కరించారు. సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి బీటీ రణదివె, పి రామ్మూర్తి చిత్రపటాలకు దువ్వా శేషుబాబ్జీ, కె.సత్తిరాజు, చెక్కల రాజ్‌కుమార్, దుంపల ప్రసాద్‌లు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రెజ్లర్ల ఉద్యమానికి సంఘీభావం తెలుపుతూ గురువారం జరిగే ఆందోళనలు జయప్రదం చేయాలన్నారు. యూనియన్ నాయకులు చంద్రమళ్ల పద్మ, దుంపల ప్రసాద్, మేడిశెట్టి వెంకటరమణ, పలివెల వీరబాబు, తదితరులు పాల్గొన్నారు.

కరపలో..

కరప: స్థానిక భవన నిర్మాణ కార్మికుల సంఘం భవనం వద్ద మంగళవారం సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవాన్ని మండల కమిటీ ఘనంగా నిర్వహించింది. ఈ సందర్భంగా సీఐటీయూ జెండాను ఆవిష్కరించారు. మండలశాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి కె.సురేష్, పి.వీ రవేణి, 104 ఉద్యోగులసంఘం జిల్లాప్రధాన కార్యదర్శి ఎం.త్రిమూర్తులు, సీఐటీయూ ప్రతినిధులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు



పెదకొత్తూరులో నిర్మాణంలో ఉన్న బోరు

కరప: వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకుంటున్నట్టు సర్పంచ్ చింతా నాగలక్ష్మి తెలిపారు. పెదకొత్తూరు సమీపంలో బోర్‌వేయించి, పైపులైన్ ద్వారా పెదకొత్తూరు, శివారు చినకొత్తూరు గ్రామాలకు రక్షిత నీరు సరఫరా చేస్తున్నామని, భూగర్భజలాలు అడుగంటడంతో కొత్త బోరు వేయిస్తున్నట్టు ఆమె తెలిపారు. చింతా సత్తిరాజు పొలంవద్ద మంగళవారం కొత్త బోరు వేయించామని, రెండు రోజుల్లో పూర్తిస్థాయిలో తాగునీరు అందిస్తామని తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకుడు చింతా బుజ్జి, పంచాయతీ సిబ్బందితో కలసి సర్పంచ్ ఈ పనులను పర్యవేక్షించారు.

రాష్ట్రంలో సంక్షేమ విప్లవం

- 2024లో ముఖ్యమంత్రిగా మళ్లీ జగన్
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే కన్నబాబు
- ప్రభుత్వం ఏర్పడి 4ఏళ్ళు పూర్తవ్వడంతో కేక్ కట్ చేసి సంబరాలు



రమణయ్యపేటలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబు



కేక్ కట్ చేస్తున్న జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు

కాకినాడ రూరల్: రాష్ట్రంలో సంక్షేమ విప్లవం జరుగుతోందని, చెప్పాడంటే చేస్తాడంతే అన్నట్టు మేనిఫెస్టోలో చెప్పిన హామీలను 98 శాతం పూర్తి చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందని, 2024లో మళ్ళీ జగనే సీఎం అవుతారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి నాలుగేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా రమణయ్యపేట క్యాంపు కార్యాలయం వద్ద మంగళవారం సంబరాలు నిర్వహించారు. కేక్‌ను కట్ చేసి పార్టీ నాయకులకు, కార్యకర్తలకు తినిపించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక అర్హులందరికీ పథకాలు వర్తింపజేశామన్నారు. చంద్రబాబు హయాంలో దాదాపు 36 లక్షల మందికి పెన్షన్లు ఉంటే ఇప్పుడు 65 లక్షల మందికి ఇస్తున్నారన్నారు. వలంటీరు, సచివాలయ వ్యవస్థలను రూపొందించి అద్భుతమైన సేవలను ప్రజలకు అందిస్తున్నారన్నారు. నాలుగేళ్ళలో దేశంలో రాష్ట్రంలో ప్రగతి పథంలో నడుస్తోందన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణ, జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ, ఏఎంసీ చైర్మన్ గీసాల శ్రీను, గోపుశెట్టి బాబ్జీ, హితకారిణి సంస్థ డైరెక్టర్ దూనబోయిన అరుణ, రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టరు జమ్మలమడక నాగమణి, శెట్టి బలిజ కార్పొరేషన్ డైరెక్టరు అనుసూరి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

జగన్‌తోనే అన్ని వర్గాల అభ్యున్నతి

కాకినాడ సిటీ: రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు ఇచ్చిన మాట నెరవేర్చడమే లక్ష్యంగా నాలుగేళ్లుగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగుతోందని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు అన్నారు. మంగళవారం జెడ్పీ కార్యాలయంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పదవీ బాధ్యతలు స్వీకరించి నాలుగేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా జెడ్పీలో చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. భారీ కేక్‌ను కట్ చేసి ఉద్యోగులకు, వైఎస్సార్ సీపీ నాయకులకు పంచారు. అన్ని వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం పని చేస్తున్నారన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన హామీల్లో 98.5 శాతం నెరవేర్చడం ద్వారా ప్రజల్లో విశ్వాసాన్ని చూరగొన్నారన్నారు. కులం, మతం, ప్రాంతం, వర్గంతో పాటు చివరికి ఎవరికి ఓటు వేశారన్నది కూడా చూడకుండా సుపరిపాలన అందించారన్నారు. బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి ఎన్నో పథకాలు ప్రవేశపెట్టి అమలు చేసిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డిదే అన్నారు. పేద విద్యార్థులు ఉన్నత చదువులు చదవాలనే మంచి ఆశయంతో అమ్మ ఒడి అందించి వారు ఇంగ్లిషు మీడియంతో పాటు కార్పొరేట్ స్థాయి విద్యను అభ్యసించాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి పెద్ద ఎత్తున నిధులు ఖర్చు చేస్తున్నారన్నారు. వీటిని చూసి ఓర్వలేని చంద్రబాబు, టీడీపీ నాయకులు ప్రజలకు అబద్ధాలు ప్రచారం చేస్తున్నారన్నారు. రానున్న ప్రజాక్షేత్రంలో టీడీపీకి తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు అన్నారు. ఈ వేడుకల్లో జెడ్పీ సీఈవో ఎన్‌వీవీ సత్యనారాయణ, డిప్యూటీ సీఈవో ఎ.రమణారెడ్డి, పలువురు ఉద్యోగ సంఘాల ప్రతినిధులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

నాణ్యత, సంతృప్తి లక్ష్యంగా అర్జీల పరిష్కారం

- ప్రతి స్థాయిలోనూ ప్రత్యక్ష పర్యవేక్షణ ప్రధానం
- ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది



నేమాంలో కుళాయి నుంచి నీటిని విడుదల చేస్తున్న గోపాలకృష్ణ ద్వివేది. చిత్రంలో ఎమ్మెల్యే కురసాల, కలెక్టర్ కృతికా శుక్లా

కాకినాడ సిటీ: పరిపాలనా సంస్కరణల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్నకు చెబుదాం (జేకేసీ) కింద వస్తున్న అర్జీల పరిష్కారంలో నాణ్యత, అర్జీదారుల సంతృప్తి అత్యంత ప్రధానమని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి (వ్యవసాయ, పశు సంవర్ధక, పాడి అభివృద్ధి, మత్స్యశాఖ) ప్రత్యేక కమిషనర్ (రైతు భరోసా కేంద్రాలు) గోపాలకృష్ణ ద్వివేది అన్నారు. మంగళవారం కలెక్టరేట్ కోర్టు హాలులో కలెక్టర్ కృతికా శుక్లా, జేసీ ఎస్.ఇలక్కియ, ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్, నగరపాలక సంస్థ కమిషనర్ ఆర్.మహేష్‌కుమార్‌తో కలిసి 'జగనన్నకు చెబుదాం'పై సమీక్షించారు. విద్యుత్, పోలీస్, రెవెన్యూ, పంచాయతీరాజ్, మున్సిపల్, గృహ నిర్మాణం, సర్వే, వ్యవసాయం తదితర విభాగాలకు సంబంధించి వస్తున్న అర్జీలు, వాటి పరిష్కారంపై ఆయా విభాగాల జిల్లా స్థాయి అధికారులతో చర్చించారు. వాటిని నిర్దేశిత గడువులోగా పరిష్కరిస్తూ, ఈ కార్యక్రమ అమలులో ముందు వరుసలో ఉన్న జిల్లా అధికార యంత్రాంగానికి గోపాలకృష్ణ ద్వివేది అభినందనలు తెలిపారు. ప్రతి శాఖ తమతమ విభాగాలకు వచ్చే అర్జీల పరిష్కారాలను సమీక్షిస్తూ, జవాబుదారీతనంతో పనిచేయాలని సూచించారు. ఈ అర్జీల పరిష్కారం నిరంతర ప్రక్రియ అని, ఇందుకు మండల, డివిజన్, జిల్లా స్థాయిలో ప్రత్యేకంగా ప్రాజెక్టు మానిటరింగ్ యూనిట్లు పని చేస్తున్నాయన్నారు. అదే విధంగా శాఖల స్థాయిలోనూ నాణ్యతను ఎప్పటికప్పుడు మదింపు చేయాలని ద్వివేది పేర్కొన్నారు. జెడ్పీ సీఈవో ఎన్‌వీవీ సత్యనారాయణ, ఇన్‌చార్జి డీఆర్వో కె.శ్రీరమణి, కాకినాడ నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు, డ్వామా పీడీ వెంకటలక్ష్మి, వ్యవసాయాధికారి ఎన్.విజయకుమారి, డీపీవో ఆర్.విక్టర్ తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా అభివృద్ధి పనులు

కాకినాడ రూరల్: జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి జిల్లా ప్రత్యేకాధికారిగా నియమితులైన రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది మండల పరిధిలోని నేమాం, తిమ్మాపురం, గంగనాపల్లి గ్రామాల్లో మంగళవారం పర్యటించారు. ఆయనతో పాటు కలెక్టరు కృతికా శుక్లాకు నేమాం–4 లే అవుట్ వద్ద ఎమ్మెల్యే కురసాల కన్నబాబు స్వాగతం పలికి లే అవుట్ వద్ద కాల్వకు రిటైనింగ్ వాల్, రహదారులు నిర్మించాల్సి ఉందని వివరించారు. అనంతరం వారు ఇళ్ల నిర్మాణాల తీరును పరిశీలించారు. అక్కడ నుంచి ఎస్సీ పేటలో జల్ జీవన్ మిషన్ పథకం కింద రూ.48.3 లక్షలతో నిర్మించిన ఓవర్ హెడ్ ట్యాంక్‌ను ప్రారంభించి నీటిని పంపిణీ చేశారు. అనంతరం ద్వివేది విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ పరంగా జరగుతున్న కార్యక్రమాలను ఇంకా ఏ విధంగా మెరుగ్గా చేయలనే దానిపై సీఎం తనను నియమించినట్టు తెలిపారు. అంతకు ముందు తిమ్మాపురం లే అవుట్‌ను సందర్శించి లబ్ధిదారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. తిమ్మాపురంలో పాము రజనీకుమారి నూతన ఇంటిని ఆయన ప్రారంభించారు. సాయంత్రం గంగనాపల్లి గ్రామంలో ఒకే చోట నిర్మించిన గ్రామ సచివాలయం, ఆర్బీకే, వెల్‌నెస్ సెంటరు, బల్క్ మిల్క్ కలెక్షన్ సెంటర్ తదితర భవనాల సముదాయాన్ని పరిశీలించారు. వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు గోపుశెట్టి బాబ్జీ, నేమాం సర్పంచ్ రామదేవు సూర్యప్రకాశరావు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీదేవి, వైఎస్ ఎంపీపీ గుత్తుల సత్తిబాబు, తిమ్మాపురంలో సర్పంచ్ బెజవాడ సత్యనారాయణ, గంగనాపల్లిలో గీసాల శ్రీనివాసరావు, తహసీల్దార్ మురార్జీ, డీఎల్‌డీఓ నారాయణమూర్తి, ఎంపీడీఓ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ ఇక్కట్ల నివారణకు చర్యలు

కమిషనర్ డాక్టర్ మహేష్‌కుమార్



ట్రాఫిక్ సమస్యలపై అధికారులతో చర్చిస్తున్న కమిషనర్ డాక్టర్ మహేష్‌కుమార్

కాకినాడ: ట్రాఫిక్ సమస్యలు నియంత్రించి, ప్రమాదాలను అదుపు చేసేందుకు చర్యలు తీసుకుంటామని నగరపాలక సంస్థ కమిషనర్ డాక్టర్ మహేష్‌కుమార్ రావిరాల తెలిపారు. మంగళవారం ఆయన ట్రాఫిక్, టౌన్‌ప్లానింగ్, నగరపాలక సంస్థలోని వివిధ విభాగాల అధికారులతో కలసి వివిధ ప్రాంతాలను సందర్శించారు. ఇటీవలే ట్రాఫిక్ నియంత్రణకు వివిధ శాఖల అధికారులతో సమావేశమైన కమిషనర్ క్షేత్ర స్థాయిలో సమస్యలను స్వయంగా పరిశీలించి పరిష్కరించేందుకు ఈ పర్యటన ఏర్పాటు చేశారు. ఏఏ ప్రాంతాల్లో ట్రాఫిక్ సిగ్నల్స్ ఉండాలి? స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి? ఇంకా ఇతర సంస్కరణల అవసరం ఏమిటి? వంటి అంశాలపై ఆయన అధికారులతో చర్చించారు. సర్పవరం జంక్షన్, స్పెన్సర్ జంక్షన్, నాగమల్లితోట జంక్షన్, రామ్‌కోసా, కోకిలా సెంటర్, వైఎస్సార్ బ్రిడ్జి, అపోలో జంక్షన్ ప్రాంతాలను సందర్శించారు. ట్రాఫిక్ అధికారులతో కూడా ఆయా సమస్యలపై చర్చించారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ ఆయా శాఖల సమన్వయంతో రహదారి భద్రత, ప్రమాదాల నివారణపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సిటీ ప్లానర్ హరిదాసు, అసిస్టెంట్ సిటీ ప్లానర్ నాగశాస్త్రులు, ట్రాఫిక్ సీఐ చైతన్య కృష్ణ, టౌన్ సర్వేయర్ సీతారామాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

గంగాధరం విగ్రహ ఏర్పాటుకు కృషి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు

- ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి
- అలరించిన స్వరార్చన సంగీత కచేరి

కాకినాడ కల్చరల్: ఆర్కెస్ట్రా పితామహుడు దివంగత పెద్దిరెడ్డి గంగాధర్ మాస్టారు విగ్రహాన్ని కాకినాడలో ఏర్పాటు చేయడానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. స్థానిక సూర్యకళామందిర్‌లో గంగాధరం 85వ జయంతి వేడుకలను ఆయన తనయుడు పెద్దిరెడ్డి సతీష్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. మస్టారి సంగీత సేవలు ఆదర్శనీయమని కొడా చైర్ పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి అన్నారు. ఆయన ఎంతో మంది శిష్యులను తయారుచేసి ఉపాధి కల్పించారని మాజీ మేయర్ సుంకర శివప్రసన్న అన్నారు. ఏపీ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ద్వారంపూడి వీరభద్రారెడ్డి, తదితర వక్తలు గంగాధర్ మాస్టార్ సంగీత సేవలను కొనియాడారు. అనంతరం ఆయనకు నివాళిగా ఏర్పాటు చేసిన స్వరార్చన సినీ సంగీత కచేరీ అలరించింది. ప్రముఖ గాయకులు రాము, నిత్య సంతోషిణి తదితరులను సత్కరించారు. ఈ కార్యక్రమానికి సంగీత ప్రియులు, మాస్టార్ అభిమానులు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

సచివాలయ విధులకు వెసులుబాటు కల్పించండి



కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న కార్యదర్శులు

కాకినాడ సిటీ: వార్డు శానిటేషన్ అండ్ ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీలకు సచివాలయ పని వేళ్లలో ఉద్యోగాలు చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతూ మున్సిపల్ కమిషనర్‌కు ఆ సిబ్బంది మంగళవారం వినతి పత్రం అందించారు. నగరపాలక సంస్థలో 81 మంది పని చేస్తున్నామని, సచివాలయం పని వేళలు ఉదయం 10 నుంచి 5 గంటల వరకు అయినా, తాము శానిటేషన్ విధులకే పరిమితం అవుతున్నామని, సచివాలయం విధులకు హాజరు కాలేకపోతున్నామన్నారు. జాబ్ చార్టు ప్రకారం సాంకేతిక సమస్యలు, ప్రజలకు తాము సేవలందించాల్సి ఉందన్నారు. తమను సచివాలయం విధుల్లో భాగస్వాములను చేయాలని రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న ఆందోళనలో భాగంగా తాము కూడా పాల్గొని కమిషనర్‌కు వినతి పత్రం అందించినట్లు వార్డు సచివాలయ శానిటేషన్ అండ్ ఎన్విరాన్‌మెంట్ కార్యదర్శులు వివరించారు.

37వ డివిజన్‌లో నేత్ర వైద్య శిబిరం



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

కాకినాడ సిటీ: నగరపాలక సంస్థ మాజీ కార్పొరేటర్ లంకే హేమలత ఆధ్వర్యంలో మంగళవారం 37వ డివిజన్ ప్రజలకు కంటి వైద్య శిబిరాన్ని పగోడా పాఠశాలలో నిర్వహించారు. జయంతి కంటి ఆసుపత్రి సౌజన్యంతో కళ్లజోళ్లు అవసరమైన వారికి అతి తక్కువ ధరకు అందించడం, అదే విధంగా శుక్లాలు ఉన్న వారికి తక్కువ ఖర్చుతో ఆపరేషన్లు నిర్వహించేలా ఏర్పాటు చేసినట్లు హేమలత తెలిపారు.

జేవీకే స్టాక్ పాయింట్ల పరిశీలన



జేవీకే స్టాక్ పాయింట్‌ను తనిఖీ చేసి సూచనలు ఇస్తున్న ఆర్జేడీ నాగమణి

సామర్లకోట: మండల పరిధిలో ప్రభుత్వ పాఠశాలలు తెరిచే నాటికి విద్యార్థులకు అందజేయడానికి సిద్ధం చేసిన జగనన్న విద్యా కానుక కిట్ల స్టాక్ పాయింట్లను ఆర్‌జేడీ జి.నాగమణి మంగళ వారం పరిశీలించారు. మండలానికి వచ్చిన పాఠ్య పుస్తకాలు, మండలంలో విద్యార్థుల సంఖ్యను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కిట్లను నిల్వ చేయాల్సిన విధానాన్ని వివరించారు.

వైభవంగా పెద్దమ్మతల్లి జాతర

కాకినాడ: స్థానిక దుమ్ములపేటలోని పెద్దమ్మతల్లి జాతర మహోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని మంగళవారం వేడుకగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించారు. అధిక సంఖ్యలో భక్తులతో పాటు, కొడా చైర్ పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ఎమ్మెల్సీ అభ్యర్థి కర్రి పద్మశ్రీ తదితర ప్రముఖులు అమ్మవారిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు వీరికి స్వాగతం పలికారు. స్థానిక నాయకులు, పెద్దలు వాసుపిల్లి కృష్ణ, పేర్ల దుర్గారామ్, మోసా పేతురు తదితరులు పాల్గొన్నారు.

దొమ్మేటికి ఎమ్మెల్యేల నివాళి

కాకినాడ రూరల్: అనారోగ్యంతో మృతి చెందిన తాళ్లరేవు మాజీ ఎమ్మెల్యే దొమ్మేటి వెంకటేశ్వరరావు భౌతికకాయానికి రూరల్, సిటీ ఎమ్మెల్యేలు కురసాల కన్నబాబు, ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి నివాళులర్పించారు. రమణయ్యపేట గ్రామ పరిధిలోని గైగోలుపాడులో దొమ్మేటి నివాసం వద్ద మంగళవారం ఉదయమే వెళ్ళి ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ద్వారంపూడి మాట్లాడుతూ రాజకీయాల్లో ఉన్నంత కాలం ప్రజల పక్షాన నిలబడి ఎన్నో సేవలు అందించిన దొమ్మేటి ఆదర్శప్రాయుడన్నారు.

ప్రభుత్వ ఉద్యోగుల ధర్నా

కాకినాడ సిటీ: ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు స్థానిక ధర్నా చౌక్ వద్ద వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు 150 మంది సామూహిక నిరాహార దీక్ష చేపట్టారు. ఉద్యమ బాటలో మూడో దశ ముగిసిందని, తమ సహనాన్ని పరీక్షిస్తే మూల్యం చెల్లించుకోక తప్పదని జిల్లా జేఏసీ చైర్మన్ పితాని త్రినాథరావు అన్నారు. ఏపీ జేఏసీ రాష్ట్ర కో చైర్మన్, రాష్ట్ర డ్రైవర్ల సంఘం అధ్యక్షులు సంసాని శ్రీనివాసరావు పాల్గొని మాట్లాడారు. వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేత

కరప: ఏపీ జీఈఏ కరప యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులు కె.చంద్రశేఖరరావు, కె.రాజగోపాలరావుల ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉద్యోగులు స్థానిక పీహెచ్‌సీ నుంచి తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి రిలే నిరాహార దీక్ష చేశారు. కార్యదర్శి డాక్టర్ జి.వీరయ్య తదితరులు వినతిపత్రాన్ని తహసీల్దార్ పి.శ్రీనివాసరావుకు అందజేశారు.

నేడు భీమేశ్వరస్వామి కల్యాణం

బోట్‌క్లబ్: స్థానిక దేవాలయంవీధిలోని బాలాత్రిపుర సుందరి సమేత భీమేశ్వరస్వామి వారి కల్యాణ మహోత్సవం ఈ నెల 31 నుంచి జూన్ 5 వరకూ జరుగుతాయని ఆలయ కమిటీ చైర్మన్ రాజనాల విజయసారధి మంగళవారం విలేకరులకు తెలిపారు. ఈ నెల 31న ఉదయం స్వామి వారికి అంకురార్పణ, ధ్వజారోహణ, రాత్రి ఏడు గంటలకు స్వామివారి కల్యాణం, జూన్ 1న అభిషేకం, అమ్మవారికి కుంకుమపూజ, సాయంత్రం 6 గంటలకు బలిహరణ, 2న స్వామి వారి చందనోత్సవం, 3న అభిషేకం, అమ్మవారికి కుంకుమ పూజ, 4న చక్రస్నానం, పూర్ణాహుతి, 5న శ్రీపుష్పయాగం జరుగుతుందన్నారు.

ఉత్సాహంగా సమ్మర్ క్రికెట్ టోర్నీ



మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందజేస్తున్న హెచ్ఎం భారతి

కరప: వేళంగిలోని మెర్లాస్ జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో వేళంగి గ్రాడ్యుయేట్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్రికెట్ టోర్నీలో మంగళవారం నో ఏజ్ లిమిట్ విభాగంలో మూడు మ్యాచ్‌లు జరిగాయి. మొదటి మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన ద్రాక్షారామం గాంధీనగర్ జట్టుపై అచ్యుతాపురం జట్టు విజయం సాధించింది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా చరణ్ నిలిచాడు. రెండో మ్యాచ్‌లో గురజనాపల్లి–2 జట్టుపై ఉండూరు జట్టు విజయం సాధించగా మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఎన్‌వీ సురేష్ నిలిచాడు. మూడో మ్యాచ్‌లో వేళంగి జట్టు భావారం బూస్టర్ జట్టుపై విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా కట్టమూరు ప్రసాద్ నిలిచాడు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డులను హైస్కూలు హెచ్ఎం జి.భారతి వేళంగి గ్రాడ్యుయేట్ యూత్ సభ్యులతో కలసి అందజేశారు.

నాడు-నేడు పనులు వేగవంతం చేయండి

కాకినాడ: నాడు–నేడు పథకంలో చేపట్టిన పాఠశాలల అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ డాక్టర్ మహేష్‌కుమార్ రావిరాల అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన కార్పొరేషన్ కార్యాలయంలో నాడు–నేడు పనుల ప్రగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిపాదించిన పనులన్నీ త్వరతగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ ఎస్ఈ సత్యకుమారి, ఈఈ వెంకట్రావు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

NOTICE

IN THE COURT OF THE 2nd ADDL. JUNIOR CIVIL JUDGE::KAKINADA
O.S.No.131/2017

Between:-
Vinjamuri Lalitha .. Plaintiff
and
1.Kola Nareen Babu (Died)
2.Kola Balachandra .. Defendants

In the above matter the 2nd Defendant evading to receive suit summons from the Hon'ble Court. The above matter is posted to 23-06-2023 for the appearance of the 2nd Defendant before the Hon'ble Court at 10-30 A.M. on that day and present in-person or through his Advocate and file his objections if any. If he fails to appear before the Hon'ble Court, the matter will be decided in his absence.

// By Order //

G.V.R.SARMA, Advocate
DNo.6-14-22, G-7 Rajaratna Residency
Gandhinagar, Kakinada - 533 004
Kakinada Cell No.94401 18123